క్లుప్తంగా

పొంచి ఉన్న ప్రమాదం

పక్కకు ఒరిగిన విద్యుత్ స్తంభం



నెహ్రూసెంటర్: జిల్లా కేంద్రంలోని వేంకటేశ్వరబజారులో విద్యుత్ స్తంభం పక్కకు ఒరిగి ఉంది. విద్యుత్ స్తంభం ఎప్పుడు కూలుతుందో తెలియని దుస్థితి నెలకొంది. పక్కనే పాఠశాల ఉండడంతో ప్రమాదం పొంచి ఉంది. విద్యుత్ స్తంభం డ్రెయినేజీ కాల్వలో ఉండడంతో ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



గంగారం: రాష్ట్రస్థాయి క్రీడలకు గంగారం ఆశ్రమోన్నత విద్యార్థులు ఎంపికై నట్లు పాఠశాల హెచ్ఎం కల్తి కాంతారావు తెలిపారు. ఏటూరునాగారంలో జరిగిన పోటీల్లో విద్యార్థినులు ఐశ్వర్య, లక్ష్మీప్రియ, శ్రావణి, సుమలత, నిఖిత, సంజీశ్వరీ ప్రతిభ కనబర్చారు. వీరిని ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో డిప్యూటీ వార్డెన్ సువర్ణపాక పాపారావు, పీడీ రేగు రమేశ్, ఉపాధ్యాయులు యాకలక్ష్మీ, వెంకటలక్ష్మీ, రమేశ్, ప్రేమ్‌సాగర్, తదితరులు పాల్గొన్నారు.

సామూహిక వ్రతాలు



కేసముద్రం: మండలంలోని బిచ్చానాయక్‌తండా జీపీ పరిధిలోని ఫారెస్టు రీసెర్చ్ సెంటర్‌లో గల ఉసిరివనంలో శ్రీమహాలక్ష్మి గణపతి సేవాట్రస్ట్ ఆధ్వర్యంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలను ఆదివారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈమేరకు మహబూబాబాద్ ఎమ్మెల్యే భుక్య మురళీనాయక్, ఉమ దంపతులు హాజరై, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు అంబటి మహేందర్‌రెడ్డి, ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

రహదారికి మరమ్మతులు




మరిపెడ రూరల్: మరిపెడ మండలం గిరిపురం ప్రధాన రహదారి గుంతలు ఉండడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో గ్రామస్తుల ద్వారా విషయం తెలుసుకున్న జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ గుడిపూడి నవీన్ రావు స్పందించాడు. గిరిపురం ప్రధాన రహదారిలో సుమారు 10ట్రాక్టర్ల మొరం పోయించి గుంతలు చదును చేయించాడు. వీన్‌రావుకు గిరిపురం గ్రామస్తులు, ప్రయాణికులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

సఖీ కేంద్రంలో మతిస్థిమితంలేని యువతి



మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ రూరల్, కేసముద్రం పోలీస్‌స్టేషన్ల మధ్య గల ముడుపుగల్, అన్నారం గ్రామాల సమీపంలో ఓ మతిస్థిమితంలేని యువతి కనిపించగా స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారని మహబూబాబాద్ రూరల్ సీఐ సర్వయ్య ఆదివారం తెలిపాడు. సదరు యువతి తన వివరాలు చెప్పలేకపోవడంతో ప్రస్తుతం ఆమెను జిల్లా కేంద్రంలోని సఖీ కేంద్రంలో అప్పగించామని, ఎవరైనా ఆమెను గుర్తుపడితే మహబూబాబాద్ రూరల్ సీఐ 87126 56950, కేసముద్రం ఎస్సై 87126 56954 నంబర్లకు సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు.

ఎంబీబీఎస్ సీటు సాధించిన అమూల్య



మహబూబాబాద్ రూరల్: కేసముద్రం మండలం కాట్రపల్లి గ్రామానికి చెందిన అధ్యాపకుడు బోడ వీరస్వామి, అరుణ దంపతుల కుమార్తె అమూల్య ప్రభుత్వ కోటాలో మహబూబ్‌నగర్ జీఎంసీ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించింది. ఆమెను బోడ లాక్యనాయక్ కుటుంబ సభ్యులు, స్నేహితులు ఆదివారం సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.

కంకర తేలి.. కోతకు గురై

- జీటీ రోడ్డు నిర్మాణ పనులను మధ్యలో నిలిపేసిన కాంట్రాక్టర్
- ఇబ్బందులు పడుతున్న డాక్యాతండా వాసులు

గార్ల: అధికారులు, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా బీటీ రహదారి నిర్మాణ పనులు మధ్యలో నిలిపివేయడంతో ఈ రహదారి గుండా వెళ్లే డాక్యాతండా గ్రామస్తులు నానా ఇబ్బందులు పడుతున్నారు. గార్ల మండలం గోపాలపురం గ్రామం నుంచి డాక్యాతండా వెళ్లే బీటీ రహదారి నిర్మాణానికి గత ఏడాది ఎన్నికల ముందు నాటి ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ రూ.కోటి నిధులు మంజూరు చేయించి బీటీ రహదారి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఎన్నికల ముందు కాంట్రాక్టర్ రహదారిని నిర్మించేందుకు నిర్మాణ పనులు ప్రారంభించి రహదారిపై కంకర పోసి రోలర్‌తో తొక్కించాడు. ఇంతలో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, బీటీ రహదారి నిర్మాణ పనులు నిలిచిపోయాయి. రహదారిపై పరిచిన కంకర 3నెలల క్రితం కురిసిన భారీ వర్షాలు, వరదలకు కోతకు గురైంది. దీంతో ఈ రహదారి గుండా మండల కేంద్రమైన గార్లకు రావాలంటే డాక్యాతండా గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామానికి రహదారి సక్రమంగా లేకపోవడంతో 108 వాహనం, ఆటోలు సైతం రావడం లేదు. ఇప్పటికైనా సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు స్పందించి బీటీ రహదారి నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించి ప్రజల ఇబ్బందులను తీర్చాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.



వరదలకు బీటీ లేచి, కోతకు గురైన రోడ్డు

కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

దంతాలపల్లి: సీసీఐ ఆధ్వర్యంలో ప్రారంభమైన పత్తి కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ విప్ రామచంద్రనాయక్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని బాలాజీ కాటన్ మిల్లులో సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు తమ పత్తిని దూరం వెళ్లి అమ్ముకోవడానికి ఇబ్బంది పడకుండా అందుబాటులోనే కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించామన్నారు. రైతులు పత్తిని సీసీఐ సూచనల మేరకు తేమ లేకుండా ఆరబెట్టుకొని మిల్లుకు తీసుకురావాలన్నారు. ఎలాంటి తరుగు తీయకుండా మద్దతు ధరతో కొనుగోలు చేయాలని సీసీఐ నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో తొర్రూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బట్టునాయక్, నాయకులు కొమ్మినేని రవీందర్, గిరివాణి, ఎల్లు కృష్ణరెడ్డి, కొమ్మినేని సతీష్, కొత్త కొమురవెల్లి పాల్గొన్నారు.



పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

మోదీ నాయకత్వంలోనే దేశం సురక్షితం



మాట్లాడుతున్న రాజమౌళిగౌడ్

తొర్రూరు రూరల్: దేశం సురక్షితం, సుభిక్షంగా ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలోనే ఉంటుందని బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యుడు నాగపూరి రాజమౌళిగౌడ్ అన్నారు. ఆదివారం డివిజన్ కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో క్రియాశీల సభ్యత్వ నమోదు కార్యక్రమంపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. దేశంలో పదేళ్లుగా మోదీ నాయకత్వంలో అనేక సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను చేపడుతూ అన్నివర్గాల ప్రజల మన్నలను పొందుతున్న గొప్ప నాయకుడు మోదీ అని కొనియాడారు. పార్టీని మరింత బలోపేతం చేస్తూ అధికారంలోకి తీసుకువచ్చేందుకు నాయకులు, కార్యకర్తలు నిరంతరం కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు పూసాల శ్రీమాన్, సుంకరనేని కోటేశ్వర్, బొచ్చు సురేష్, పల్లె కుమార్, రాజేష్, నవీన్, రాజ్‌కుమార్, రాంబాబు, విష్ణు, యాకన్న పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వంపై పోరాటం తప్పదు

తొర్రూరు రూరల్: దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతున్న కేంద్ర ప్రభుత్వంపై పోరాటం తప్పదని సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని గుర్తూరు గ్రామంలో సీపీఎం పార్టీ మండల 5వ మహాసభను నిర్వహించారు. ముందుగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు గ్రామంలో డప్పుచప్పుళ్లతో ఆటపాటలతో ఊరేగింపు చేసి, పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన మహాసభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న శ్రీనివాస్ మాట్లాడారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ధనవంతులు, పెట్టుబడిదారులు, కాంట్రాక్టర్లకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకొని పర్సంటేజీలు తీసుకుంటూ ప్రజాపాలన పేరుతో ప్రభుత్వాన్ని కొనసాగిస్తుందని ఆరోపించారు. ఈ సమావేశంలో నాయకులు అశోక్, మోహన్, యాకుబ్, మమత, యాకయ్య, సాంబయ్య, సాయిమల్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సాదుల శ్రీనివాస్

అమరుల ఆశయ సాధనకు ఉద్యమించాలి

మహబూబాబాద్ రూరల్: నూతన ప్రజాస్వామిక విప్లవ సాధనకు పోరాడటమే అమరవీరులకు నిజమైన నివాళి అని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి హాలావత్ లింగన్న, జిల్లా నాయకులు గుజ్జు దేవేందర్ అన్నారు. అమరవీరుల సంస్మరణ సభల వారోత్సవాల్లో స్మారక స్థూపాల వద్ద శనివారం రాత్రి జెండాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ కార్యదర్శులు కాడబోయిన శ్రీశైలం, పులిగిల్ల బాలమల్లు, భగవాన్, లక్ష్మయ్య, సామ పాపయ్య పాల్గొన్నారు.

బయ్యారం: ప్రజల కోసం తమ ప్రాణాలను అర్పించిన అమరుల ఆశయసాధనకు విప్లవ పార్టీ శ్రేణులు ఉద్యమించాలని న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు ఆరెల్లి కృష్ణ అన్నారు. మండలంలోని గురిమెళ్లలో ఆదివారం నిర్వహించిన అమరవీరుల సంస్మరణ కార్యక్రమంను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు మదార్, సమ్మయ్య, పాపయ్య, నర్సయ్య, భద్రయ్య పాల్గొన్నారు.

పోరాట ఫలితమే మెస్‌చార్జీల పెంపు



మాట్లాడుతున్న స్కైలాబ్‌బాబు

నెహ్రూసెంటర్: కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి (కేవీపీఎస్), విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో దశల వారి పోరాటాల ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం మెస్‌చార్జీలను పెంచిందని కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి టి.స్కైలాబ్‌బాబు అన్నారు. సంఘం జిల్లా కమిటీ సమావేశం పెరుమాళ్ల జగన్నాథం భవనంలో ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోరాటాల ద్వారా మెస్‌చార్జీలను ప్రభుత్వం పెంచిందని, కానీ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఇంకా పెంచాల్సి ఉందన్నారు. ఈ సమావేశంలో సంఘం ఉపాధ్యక్షుడు సాదుల శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి దుడ్డెల రాంమూర్తి, జిన్న లచ్చయ్య, మందుల మహేందర్ పాల్గొన్నారు.

రైల్వే కార్మికుల సంక్షేమం కోసం కృషి



డోర్నకల్‌లో పర్యటిస్తున్న యూనియన్ నాయకులు

డోర్నకల్: మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో రైల్వే కార్మికుల సంక్షేమం కోసం కృషి చేస్తున్నామని యూనియర్ డివిజనల్ సెక్రెటరీ రవీందర్ తెలిపాడు. డిసెంబర్‌లో జరగనున్న గుర్తింపు ఎన్నికలపై ఆదివారం స్థానిక నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ.. రైల్వే కార్మికుల సమస్యల పరిష్కారం కోసం పోరాడిన ఏకై క సంఘంగా మజ్దూర్ యూనియన్ గుర్తింపు పొందిందన్నారు. డిసెంబర్‌లో జరగబోయే గుర్తింపు ఎన్నికల్లో యూనియన్ గెలుపు కోసం నాయకులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో అంజియాదవ్, యుగేందర్, చరణ్, సుందరయ్య, నాగేషు, అరుణ్, తదితరులు పాల్గొన్నారు.

నేలవాలిన వరిపంట

బయ్యారం: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం ఒక్కసారిగా గాలితోపాటు వచ్చిన భారీ వర్షం కారణంగా కోతకు వచ్చిన వరిపంట పలు చోట్లు నేలవాలడంతో రైతులకు నష్టంను చేకూర్చింది. ఆరబెట్టిన మొక్కజొన్నలు తడిచిపోయాయి.



నేలవాలిన వరి

షాపుల్లో చోరీకి యత్నం

మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని రెండు షాపుల్లో దొంగలు చోరీకి యత్నించిన సంఘటన ఆదివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని కురవి గేటు ప్రాంతంలో ఆంజనేయ ఫర్టిలైజర్స్ షాపు నిర్వహించే గండు రమేశ్ రోజు మాదిరిగానే శనివారం రాత్రి షాపు బంద్ చేసి వెళ్లాడు. ఆదివారం తెల్లవారుజామున ఓ దొంగ వారి షాపు గదికి అమర్చిన ఇనుప చువ్వల గ్రిల్ తొలగించి చోరీ చేసేందుకు యత్నించాడు. ఆ సమయంలో ఇంటి భవనంపై నుంచి రమేశ్ నిద్రలేచి కిందకు రాగా ఇనుప రాడ్ శబ్దం విని ఎవరు అని అడుగుతుండగా దొంగ అక్కడి నుంచి పారిపోయాడు. జరిగిన సంఘటనపై మహబూబాబాద్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు వచ్చి ఘటన స్థలాన్ని పరిశీలించారు. అదే విధంగా సూర్యా థియేటర్ ప్రాంతంలో గల కూల్ డ్రింక్స్ డిస్ట్రిబ్యూటర్ సుంకరి అప్పారావు షాపునకు ఉన్న ప్రధాన ద్వారం తలుపును దొంగలు తొలగించి చోరీ చేసేందుకు యత్నించారు. కాగా తలుపు వెనకాలే మరో ద్వారం తలుపు ఉండటం వలన దొంగలు దానిని తొలగించకుండా వెళ్లిపోయారు. జరిగిన సంఘటనపై బాధితుడు అప్పారావు మహబూబాబాద్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

పెద్దవంగర: రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండల కేంద్రంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన జలగం యాకయ్య (45) వ్యక్తిగత పనుల నిమిత్తం ఇంటి నుంచి తన ద్విచక్రవాహనంపై తొర్రూరుకు బయలుదేరాడు. తిరుమలగిరి నుంచి తొర్రూరు వైపు వెళ్తున్న లారీని వెనుక భాగంలో పెద్దవంగర ఎక్స్ రోడ్డు వద్ద ద్విచక్రవాహనంపై వెళ్తున్న యాకయ్య బైక్ ఢీకొట్టింది. దీంతో అతడికి గాయాలు కాగా చికిత్స నిమిత్తం వరంగల్ ఆస్పత్రికి తరలించారు.

వర్గీకరణ చేపట్టకుంటే పోరాటం తప్పదు



మాట్లాడుతున్న మంద కుమార్

నెహ్రూసెంటర్: ఎస్సీ వర్గీకరణ ప్రక్రియ పూర్తి చేయకుంటే కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటం తప్పదని ఎంఎస్పీ జాతీయ నాయకులు మంద కుమార్‌మాదిగ హెచ్చరించారు. ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నూతన మండల కమిటీ నిర్మాణ సదస్సును జిల్లా కేంద్రంలో సంఘం జిల్లా అధ్యక్షుడు శాగంటి రమేశ్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాలల ఒత్తిడికి తలొగ్గి, సుప్రీం తీర్పును సైతం దిక్కరిస్తూ మాదిగలకు కాంగ్రెస్ ప్రభుత్వం ద్రోహం చేయాలని చూస్తే సహించేది లేదన్నారు. వర్గీకరణ ప్రక్రియ మేమే ముందుగా అమలు చేస్తామని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి మాదిగలకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. అనుబంధ సంఘాల బలోపేతం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో జాతీయ కార్యదర్శి గుగ్గిళ్ల పీరయ్య మాదిగ, జాతీయ అధికార ప్రతినిధి బొర్ర బిక్షపతి, వేల్పుల సూరన్న, రాష్ట్ర కార్యదర్శి దుప్పెల్లి అనిల్‌మాదిగ, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు పోలెపాక ఎల్లయ్య, ప్రవీణ్, ఎండి.రజియా పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను మోసం చేసిన ప్రభుత్వం

మహబూబాబాద్ అర్బన్: ఎన్నికల మేనిఫెస్టోలో విద్యారంగానికి, టీచర్లకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చకుండా ప్రభుత్వం మోసగిస్తుందని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు చుంచు శ్రీశైలం అన్నారు. జిల్లా కేంద్రంలో టీపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగ ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న అన్ని బిల్లులు చెల్లించాలని, ఇచ్చిన హామీలను నేరవేర్చాలన్నారు. కులగణన కోసం ఒక్కపూట బడుల నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పులిచింత విష్ణువర్ధన్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు సోమారపు ఐలయ్య, బొల్లం శ్రీనివాస్, సైదుల్‌పాషా, బలాష్టి రమేశ్, సువర్ణ, జిల్లా కార్యదర్శులు మల్లెల సాంబయ్య, చీకటి ఉపేందర్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చుంచు శ్రీశైలం

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



కురవి: ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు



నెల్లికుదురు: ఆలేరులో..

కురవి: మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో 1998–1999 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకున్నారు. నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. తమకు పాఠాలు నేర్పిన ఉపాధ్యాయులు బుక్క నాగరాజు, మందుల శ్రీరాములు, వెంకటయ్య, జానకీరాములు, వీరయ్యలను సన్మానించారు.

నెల్లికుదురు: మండలంలోని ఆలేరు జెడ్పీహెచ్ఎస్‌లో 1998–99 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అప్పటి జ్ఞాపకాలను ఒకరినొకరు పంచుకున్నారు. నాటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.

ఎమ్మెల్యేకు ఆహ్వానం

మరిపెడ రూరల్: మండలంలోని బురికితండా గ్రామ పంచాయతీ పరిధిలోని పీర్యతండాలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని తెలంగాణ రాష్ట్ర గిరిజన పోరాట సమితి రాష్ట్ర కార్యవర్గ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. ఈసందర్భంగా ఈనెల 12న భూమి పూజకు ఎమ్మెల్యే జాటోతు రాంచంద్రునాయక్‌కు ఆహ్వాన పత్రిక అందజేశారు. పార్టీ మండల అధ్యక్షుడు పెండ్లి రఘువీరారెడ్డిని కూడా ఆహ్వానించారు. కార్యక్రమంలో గిరిజన పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రవికుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ అజ్మీర వీరన్న, రవికుమార్, మండల నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

నేడు కులగణన సర్వేపై అవగాహన సదస్సు

గార్ల: గార్లలోని రైతువేదిక భవనంలో నేడు కులగణన సర్వేపై అధికారులకు, సర్వే టీం సభ్యులకు అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ మంగమ్మ ఆదివారం వెల్లడించారు. ఈ సదస్సులో పంచాయతీ కార్యదర్శులు, బీఎల్‌ఓలు విధిగా హాజరుకావాలని ఆమె కోరారు.

బోధనకు అంతరాయం లేకుండా సర్వే చేయాలి

దోర్నకల్: బోధనాభ్యస ప్రక్రియకు అంతరాయం కలగకుండా కులగణన సర్వే నిర్వహించాలని యూటీఎఫ్ మండలశాఖ అధ్యక్ష, కార్యదర్శులు అబ్దుల్ అజీజ్, శివప్రసాద్ కోరారు. ఆదివారం వారు మాట్లాడుతూ.. ఉపాధ్యాయులకు కేటాయిస్తున్న సర్వేకు సంబంధించి మధ్యాహ్న వేళలు అనుకూలం కాదన్నారు.

పాఠశాలలు బంద్ చేయడం సరికాదు

కురవి: కులగణనకు ఒక్క పూట పాఠశాలలను బంద్ చేయడం సరికాదని టీపీటీఎఫ్ సీరోలు మండల ప్రధాన కార్యదర్శి సజ్జనము విద్యాసాగర్ అన్నారు. ఆదివారం సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే దసరా సెలవులతో బోధన కుంటుపడిందన్నారు. ఉపాధ్యాయులకు ఓడీ ఇచ్చి కులగణనను పూర్తి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో బాబురావు, వీరేందర్, సునీల్, వేణు, మనోహర్ పాల్గొన్నారు.

కుల గణనలో పాల్గొనాలి

మహబూబాబాద్ రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న కులగణనలో వివిధ కులాల బాధ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని టీపీసీసీ ఎస్టీ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ గుగులోతు వెంకట్ నాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలో ఆదివారం వెంకట్ నాయక్ మాట్లాడుతూ.. సమగ్ర కులగణన ఈనెల ఆరో తేదీ నుంచి ప్రారంభం కానుండగా గిరిజనులు విధిగా పాల్గొని అధికారులకు తమ సమాచారాన్ని తెలియజేయాలని కోరారు.

గిరిజన సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి

కురవి: ఈనెల 5న ఖమ్మం జిల్లా కేంద్రంలో నిర్వహించే గిరిజన సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు మాలోత్ కిషన్‌నాయక్ పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని బలపాల శివారు లింగ్యా తండాలో కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో దేవానాయక్, తిరుపతినాయక్, శ్రీరామ్‌నాయక్ పాల్గొన్నారు.

సరుకుల అందజేత

కురవి: మండలంలోని మోద్గులగూడెం గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన నెలమర్రి లింగన్న విజయ దంపతుల కుమార్తె పుట్టుకతోనే దివ్యాంగురాలు. కుటుంబ స్థితిని తెలుసుకున్న కురవికి చెందిన గంగరబోయిన రఘు అనే యువకుడు దాత ఓం శ్రీనాథ్ సహకారంతో నిత్యావసర సరుకులను ఆదివారం కుటుంబానికి అందజేశారు.

ఒకే ఈతలో మూడు పిల్లలకు జన్మనించిన గొర్రె

తొర్రూరు రూరల్: మండలంలోని పత్తేపురం గ్రామంలో గొర్రె ఒకే ఈతలో మూడు పిల్లలకు జన్మనించిన అరుదైన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. ఇట్టె మధుసూదన్‌రెడ్డి అనే రైతుకు చెందిన గొర్రె మూడు పిల్లలకు జన్మనిచ్చింది.

సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీలో చేరికలు

నెహ్రూసెంటర్: సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ (చంద్రన్న) పార్టీలో జిల్లా కేంద్రంలోని కనకయ్యనగర్ కాలనీకి చెందిన పది కుటుంబాలు పార్టీలో చేరారని పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్‌కే మధార్, జిల్లా నాయకులు ఎస్‌కె.బాబన్న తెలిపారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం పార్టీలోకి ఆహ్వానించారు. దేవేందర్, ఐలయ్య, పాపన్న, సరిత, రజిత పాల్గొన్నారు.

మద్యం షాపు సీజ్

గూడూరు: మండల కేంద్రంలోని గణేష్ వైన్స్‌లో అధిక ధరలకు మద్యం విక్రయిస్తుండగా పట్టుకున్న ఎక్సైజ్ స్టేట్ టాస్క్‌ఫోర్స్ అధికారులు శనివారం రాత్రి షాపును సీజ్ చేశారు. వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని మూడు మద్యం షాపుల యజమానులు సిండికేట్ అయి షాపుల్లో మాత్రం ఎమ్మార్పీ ధరలకు మద్యం విక్రయిస్తున్నారు. దీంతో కొందరు హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్‌కు ఫిర్యాదు చేశారు. వెంటనే గూడూరులోని గణేష్ వైన్స్ చేరుకున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు గుర్తించి వెంటనే సీజ్ చేసినట్లు ఎక్సైజ్ శాఖ అధికారులు తెలిపారు.

సన్మానం

కురవి: మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఇస్లావత్ సుధాకర్‌ను నియమిస్తు ఉత్తర్వులు అందడంతో ఆదివారం రాత్రి కురవి మండల కేంద్రంలోని గుడి సెంటర్ వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు సన్మానించి సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు అంబటి వీరభద్రంగౌడ్, గుగులోత్ ప్రవీణ్‌నాయక్, బాదె వీరభద్రం పాల్గొన్నారు.

కారు ఢీకొని గుమ్మీ ధ్వంసం

మహబూబాబాద్ రూరల్: కారు ఢీకొని ఓ విద్యుత్ స్తంభం, చిరు వ్యాపారికి సంబంధించిన గుమ్మీ ధ్వంసమైన సంఘటన జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆదివారం చోటు చేసుకుంది. నెహ్రూసెంటర్ నుంచి తహసీల్దార్ కార్యాలయం మీదుగా మూడుకోట్ల సెంటర్ వైపు వెళ్తున్న ఓ కారు అతి వేగంగా వచ్చి తహసీల్దార్ కార్యాలయం ఎదుట గల చిరువ్యాపారి గుమ్మీని ఢీకొట్టగా అక్కడ ఉన్న వాటర్ ఫ్రిజ్, ఇతర సామగ్రి ధ్వంసం అయ్యాయి. 11కేవీ విద్యుత్ స్తంభం కూడా ధ్వంసం కాగా విద్యుత్ శాఖ డీఈ విజయ్, ఇతర అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని కొత్త స్తంభం ఏర్పాటు చేశారు. జరిగిన సంఘటనపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విద్యుత్ శాఖ అధికారులు ఫిర్యాదు చేశారు.

అరుణ్‌గౌడ్ సేవలు మరువలేనివి

గార్ల: కవి, రచయితగా, ఉద్యోగులు, నిరుపేదలకు బాసటగా అరుణ్‌గౌడ్ చేసిన సేవలను ఎన్నటికీ మరువలేమని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కందునూరి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం జరిగిన అరుణ్‌గౌడ్ సంతాపసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. లక్ష్మణ్‌నాయక్, శంకర్‌రావు, రాజన్న, సత్యం పాల్గొన్నారు.

నూతన ఉద్యోగులకు సన్మానం

నెల్లికుదురు: మండలంలోని బ్రాహ్మణకొత్తపల్లి గ్రామంలో న్యూజనరేషన్ ఆఫ్ ఫౌండేషన్ బీకేపల్లి ఆధ్వర్యంలో గ్రామంలో నూతనంగా డీఎస్సీలో ఉద్యోగాలు సాధించిన వారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో చిర్ర యాకాంతం గౌడ్, మైపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ రైతు వ్యవస్థను కొనసాగించాలి



మహబూబాబాద్ రూరల్: సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆదర్శ రైతుల వ్యవస్థను మళ్లీ కొనసాగించాలని మహబూబాబాద్ మండలంలోని ఆదర్శ రైతులు కోరారు. జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ ఆవరణలో ఆదివారం ఆదర్శ రైతుల మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా బెల్లంకొండ యాకన్న, ఉపాధ్యక్షుడిగా గుగులోతు మాలు, ప్రధాన కార్యదర్శిగా కావటి జనార్దన్ యాదవ్, కోశాధికారిగా నలమాస రవికుమార్, సహాయ కార్యదర్శిగా గుండెబోయిన రామన్న, కార్యవర్గ సభ్యులుగా శంషుద్దీన్, గుండపునేని అశోక్, జినుక సరిత, బైరోజు వెంకటాచారి, ఎనల్ల లింగన్న, పచ్చిపాల లావణ్య ఎన్నికయ్యారు.